నమస్తే తెలంగాణ
కరీంనగర్
3 | కరీంనగర్, గురువారం 15 ఫిబ్రవరి 2024 | KARIMNAGAR

శాంతి భద్రతల్లో నో కాంప్రమైజ్

శాంతిభద్రతల పరిరక్షణే నా లక్ష్యం. ఎక్కడా వెనక్కి తగ్గేదిలేదు. కమిషనరేట్ పరిధిలో గంజాయి వినియోగం, అక్రమ రవాణా చేసేవారితో పాటు భూ మాఫియా భరతం పడుతం. మంచివారికి మాత్రమే ఫెండ్లీ పోలీస్. నేరస్తులు, గూండాగిరీకీ ఇక్కడ స్థానం లేదు. శాంతిభద్రతల పరిరక్షణలో కాంప్రమైజ్ అయ్యేది లేదు. నాకు అన్నిరంగాల్లో పనిచేసిన అనుభవం ఉన్నది. అయేషా మీరా కేసులో నిందితుల అరెస్ట్‌తోపాటు మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్‌లో దుర్మరణం ఘటనపై కేసు విచారణ నా జీవితంలో మరిచిపోలేనిది. ర్యాగింగ్ అనేది సీనియర్లు జూనియర్లకు మార్గదర్శనంగా ఉండాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు.

– రామగుండం పోలీస్ కమిషనర్‌గా బ్యాధతల స్వీకరించిన సందర్భంగా శ్రీనివాసులు

డాక్టర్ కావాలనుకున్నా.. పోలీస్ అయ్యా

రామగుండం సీపీ ఎం శ్రీనివాసులు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 14: తనకు డాక్టర్ కావాలని కల ఉండేదని, రెండుసార్లు ప్రయత్నించినా నెరవేరలేదని, చివరకు పోలీస్ అయ్యానని రామగుండం సీపీ ఎం శ్రీనివాసులు చెప్పారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో కాసేపు ముచ్చటించారు. తన కుటుంబం, చదువు, ఉద్యోగం ఇలా అన్నింటి గురించి వివరించారు. తన పూర్వీకులది నారాయణపేట జిల్లా అని, తాత నిజాం జాగీర్‌దారుగా ఉండేవారని, తన తండ్రి వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లోని లాల్‌దర్వాజ్‌కు వచ్చి స్థిరపడ్డారని చెప్పారు. 'నేను ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి దాకా లాల్ దర్వాజ్‌లోని వెంకట్రావ్ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాల, ఆరో నుంచి ఇంటర్ దాకా మహబూబ్‌నగర్‌లో చదివా. అనంతరం హైదరాబాద్‌లో డిగ్రీలో ఫస్టియర్‌లో చేరా. కానీ, డాక్టర్ కావాలన్న కోరికతో ఎంసెట్ కోచింగ్ తీసుకున్నా. మొదట హోమియోపతి, రెండో దఫా అగ్రికల్చర్ సీట్ వచ్చింది. అయితే ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేక నా ఆలోచన విరమించుకున్నా. తర్వాత ఉస్మానియాలో ఓపెన్ డిగ్రీ, ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశా' అని గుర్తు చేసుకున్నారు. అనంతరం తన ఫ్రెండ్స్, బంధువుల సూచనతో రెండు సార్లు యూపీఎస్‌సీ పరీక్షలకు హాజరయ్యానని, రెండుసార్లు ఇంటర్వ్యూలో ఎంపిక కాలేదని చెప్పారు. అనంతరం ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్లాలని అనుకున్నానని, అయితే అక్కడ సంక్షోభం రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నానని చెప్పారు. తర్వాత 2001లో అప్పటి ఉమ్మడి ఏపీలో గ్రూప్-1 ఉద్యోగం సాధించి, డీఎస్పీగా మొదటి పోస్టు అనంతపూర్ జిల్లా ధర్మవరంలో వచ్చిందన్నారు. తర్వాత ఖమ్మం డీఎస్పీగా, నల్గొండ దేవరకద్ర, నందిగామ డీఎస్పీగా, హైదరాబాద్‌లో సీసీఎస్ టాస్క్‌ఫోర్స్‌లో డీఎస్పీగా పనిచేశానని, 2006లో ఐపీఎస్‌కు ఎంపికైనట్లు వివరించారు. అనంతరం రంగారెడ్డి ఎస్పీగా, సీఐడీ ఎస్పీగా ఇంటర్ పోల్‌లో మూడేండ్లు పనిచేసి, 2017లో ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేసి, హైదరాబాద్‌లో జాయింట్ సీపీగా పనిచేసినట్లు తెలిపారు. ఇటీవల సీఐడీలో డీఎస్పీగా పనిచేసి తాజా బదిలీలో రామగుండం సీపీగా వచ్చానని శ్రీనివాసులు పేర్కొన్నారు.

మెట్‌పల్లి మార్కెట్‌లో పసుపు కొనుగోళ్లు షురూ

మెట్‌పల్లి, ఫిబ్రవరి14: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు కొనుగోళ్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ముందుగా అడ్డి, వర్తకులు ప్రత్యేక పూజలు చేసి, రైతులు అమ్మకానికి తెచ్చిన పసుపును కొనుగోలు చేశారు. పసుపులో మూడు రకాలు ఉండగా, మొదటి రోజు పసుపు కాడి 181 క్వింటాళ్లు, పసుపు గోళ 84 క్వింటాళ్లు, పసుపు చూర 20 క్వింటాళ్లు సేకరించారు. క్వింటాల్ కాడికి కనిష్ఠంగా ₹8,311, గరిష్ఠంగా ₹12,888 ధర, క్వింటాల్ గోళకు కనిష్ఠంగా ₹8,366, గరిష్ఠంగా ₹11,666, పసుపు చూర క్వింటాల్‌కు కనిష్ఠంగా ₹8,626, గరిష్ఠంగా ₹11,111 ధర పలికింది. మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి క్రయ, విక్రయాలను పరిశీలించారు.

పసుపుకొమ్ముల కుప్పలను పరిశీలిస్తున్న వర్తకులు

తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు

విచ్చలవిడిగా వినియోగిస్తున్న ఉపాధ్యాయులు

- ఉత్తర్వులున్నా పట్టని టీచర్లు
- హెచ్ఎంల వద్దే సెల్‌ఫోన్ ఉంచాలన్న నిబంధనలు బేఖాతర్
- అడిగితే తిట్ల పురాణం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం
- విద్యార్థులపై ప్రభావం చూపుతుందంటున్న తల్లిదండ్రులు
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- కఠినచర్యలు తీసుకుంటామని జగిత్యాలలో డీఈవో ఆదేశాలు
- మిగిలిన జిల్లాల్లో చోద్యం చూస్తున్న అధికారులు

వ్యక్తిగత పనుల కోసం తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వినియోగించడం పూర్తిగా నిషేధం. అందుకు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులున్నా పట్టించుకునే వారు లేరు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మెజార్టీ ఉపాధ్యాయులు విచ్చలవిడిగా సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. కొందరు క్లాస్ రూములోనే ఫోన్ మాట్లాడితే.. మరికొందరు బోధనను మధ్యమధ్యలో ఆపేసి బయటకు వచ్చి మాట్లాడి వెళ్తున్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటుందన్న విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తల్లిదండ్రులు, పిల్లల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. దీనిపై జగిత్యాల జిల్లాలో విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి తాజాగా స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయగా.. మిగిలిన జిల్లాల్లో డీఈవోలు ఇంకా చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి జారీ చేసిన ఉత్తర్వు కాపీ

కరీంనగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు వాడుతుండడంతో విద్యార్థులకు నష్టం జరుగుతున్నది. దీనిని గమనించిన రాష్ట్ర విద్యాశాఖ, ఈ విషయంపై అనేక మంది విద్యాసంస్థలు, మేధావుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నది. క్లాస్ రూముల్లో సెల్‌ఫోన్లు వాడొద్దని 2013లోనే స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. తిరిగి 2014, 2020లోనూ మరింత పకడ్బందీగా ఆదేశాలు ఇచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత అలాగే కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలో సెల్‌ఫోన్లు ఉపయోగించరాదని స్పష్టం చేసింది. ప్రతి ఉపాధ్యాయుడు తన సెల్‌ఫోన్‌ను ఆయా విద్యాసంస్థల హెడ్‌మాస్టర్లు, లేదా ప్రిన్సిపాల్ వద్ద ఉంచి తరగతి గదులకు వెళ్లాలని, అధికారికంగా ఏమైనా మాట్లాడాల్సి ఉంటే.. కచ్చితంగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకొని వినియోగించాలన్న నిబంధన ఉన్నది. కొన్నాళ్ల పాటు ఇది బాగానే అమలైనా మధ్యలో కొంత అదుపు తప్పింది. దీంతో రాష్ట్ర విద్యాశాఖ 2020లో మరోసారి మరింత పకడ్బందీగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మధ్యకాలంలో మెజార్టీ ఉపాధ్యాయులు నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జగిత్యాల జిల్లాలో ఓ ఉన్నతాధికారి రెండు మూడు పాఠశాలలను పర్యవేక్షించినప్పుడు.. ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదుల్లోనే సెల్‌ఫోన్ వినియోగిస్తున్నట్టు గుర్తించారు. అంతేకాదు, కొంతమంది ఉపాధ్యాయులైతే ఏకంగా తరగతి గదిని విడిచిపెట్టి.. బయటకు వచ్చి పది నుంచి పదిహేను నిమిషాల పాటు మాట్లాడి.. మళ్లీ తరగతి గదిలోకి వెళ్తున్నట్టు గుర్తించారు. ఈ విధానం కేవలం సదరు పాఠశాలలకు మాత్రమే పరిమితం కాలేదు. ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ పాఠశాలల్లో ఇదే తంతు నిత్యం కొనసాగుతున్నది.

అధికారుల చోద్యం

జగిత్యాల జిల్లా విద్యాధికారి తాజాగా ఆదేశాలు జారీ చేయగా.. మిగిలిన విద్యాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. నిజానికి క్లాస్ రూముల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతున్నదని గతంలోనే అనేక అధ్యయన సంస్థలు వెల్లడించాయి. సబ్జెక్టు బోధిస్తున్నప్పుడు సదరు టీచర్ ఫోన్ పట్టుకొని మధ్యమధ్యలో బయటకు వెళ్లడం, మళ్లీ వచ్చి బోధన చేయడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత దెబ్బతింటున్నదని మానసిక శాస్త్రవేత్తలు కూడా గతంలోనే హెచ్చరించారు. అలాగే, ఉపాధ్యాయులు పాఠశాలల్లో నడుచుకునే విధానాన్ని పిల్లలు అనుసరిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. అయితే, వాటిని అమలు చేయడంలో జిల్లాల యంత్రాంగం తరచుగా విఫలమవుతున్నది. ఇప్పటికే అంతంత మాత్రంగా నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి కార్యకలాపాలు నివారించకపోతే.. అసలు ఉనికికే ముప్పు వాటిల్లుతుందన్న అభిప్రాయాలను పలువురు ఉపాధ్యాయులే వ్యక్తం చేస్తున్నారు. విద్యాధికారులందరూ ఈ కోణంలో చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పర్యవేక్షణా లోపం.. ఆదేశాలు

పాఠశాలల పర్యవేక్షణ అనేది ఉన్నతాధికారులు గాలికొదిలేశారు. ప్రతి జిల్లా విద్యాధికారి, ఉపవిద్యాధికారి, మండల విద్యాధికారి నెలలో కొన్ని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేయాలన్న నిర్దిష్ట నిబంధనలున్నా ఆ దిశగా తనిఖీలు కరువయ్యాయి. కొన్ని చోట్ల మొక్కుబడిగా జరుగుతున్నా.. మరికొన్ని జిల్లాల్లో అధికారులు అసలు పర్యవేక్షణకే వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. దీని వల్లే మెజార్టీ ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లను విచ్చలవిడిగా వాడుతున్నారనే విమర్శలున్నాయి. కొంతమంది టీచర్లు నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటున్నా... మెజార్టీ ఉపాధ్యాయులు అనుసరిస్తున్న విధానం వారికి కూడా చెడ్డ పేరు తెచ్చిపెడుతున్నది. నిబంధనల ప్రకారం.. సెల్‌ఫోన్లు అప్పగించి వెళ్లాలని ఎవరైనా ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ అడిగితే... పలువురు టీచర్లు బూతుపురాణం అందుకుంటూ తిరుగుబాటు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో..? అన్న చందాన వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. అలాగే, ఈ తరహా నడుచుకునే పంతుళ్లకు కొన్నిసంఘాలు కూడా వంతపాడుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయులు క్లాస్ రూముల్లో సెల్‌ఫోన్లు వాడుతుండడం, ఇష్టానుసారం వినియోగిస్తుండడం వంటివి విద్యార్థులపై ప్రభావం చూపుతున్నాయి. ఈ విషయంపై ఇటీవల కొంతమంది తల్లిదండ్రులు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో జగిత్యాల జిల్లా డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా, ఆ జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వ జీవోలను పేర్కొంటూ.. వాటి ప్రకారం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ అనుసరించాల్సిన నియమ నిబంధనలను గుర్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో ఉన్న ఆదేశాల ప్రకారం తరగతి గదుల్లో విద్యార్థుల ఫేస్ రికగ్నైజేషన్ చేయాల్సి వచ్చినప్పుడు, ఇంటర్నెట్ వినియోగించి ఏదైనా పాఠం చెప్పాల్సి వచ్చినప్పుడు, అలాగే అధికారిక సమాచారం ఏదైనా ఇవ్వాల్సి ఉన్నప్పుడు మాత్రమే సదరు విద్యాసంస్థ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ అనుమతి తీసుకొని సెల్‌ఫోన్ వినియోగించాలని సదరు ఆదేశాల్లో డీఈవో స్పష్టం చేశారు. మిగిలిన సమయాల్లో ఉపాధ్యాయుల సెల్‌ఫోన్లను ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ వద్ద ఉంచాలని ఆదేశించారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే జైలుకే

- సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్
- మెడికల్ షాప్, ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం

మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 14: డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే జైలు తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. గడువు ముగిసిన, తక్కువ క్వాలిటీ, నకిలీ మత్తు మందులకు సంబంధించినవి అమ్మితే చర్యలుంటాయని స్పష్టం చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రేణుకా మాతా ఫంక్షన్ హాల్‌లో జిల్లాలోని మెడికల్ ఏజెన్సీ, మెడికల్ షాప్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్‌శాఖ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నదని చెప్పారు. ఓ వైపు గంజాయి అక్రమ రవాణాపై వరుసగా దాడులు చేస్తూనే, ఇతర మత్తు పదార్థాలపైనా దృష్టిపెట్టినట్లు చెప్పారు. యువత సింథటిక్ డ్రగ్స్ వైపుకు ఆకర్షితులవుతున్న నేపథ్యంలో మెడికల్ షాపుల నిర్వాహకులు తరుచూ మత్తు మందు కోసం వచ్చే వారి సమాచారం పోలీసులకు ఇవ్వాలని కోరారు. ప్రతి షాప్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే జిల్లాలో ఏర్పాటు చేసిన డీ- అడిక్షన్ సెంటర్‌కి సంబంధించిన పోస్టర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని, టౌన్ సీఐ రఘుపతి, మెడికల్ షాప్ నిర్వహకులు ఉన్నారు.

కరీంనగర్ బస్టేషన్‌లో బస్సెక్కుతున్న ప్రయాణికులు

కిక్కిరిసిన బస్‌స్టేషన్

ఓ వైపు వేములవాడ రాజన్న, మేడారం సమ్మక్క దర్శనాలు.. మరోవైపు శుభ ముహూర్తాలు, అత్యధిక పెండిళ్లు, శుభకార్యాలు.. ఇంకోవైపు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోనే అతిపెద్దదైన కరీంనగర్ బస్‌స్టేషన్ బుధవారం ఇసుకేస్తే రాలనంత మందితో రద్దీగా మారింది. అయితే, తగినన్ని బస్సులు లేక ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఒకవేళ బస్సులు వచ్చినా పరిమితికి మించి మంది ఉండడంతో సీట్ల కోసం అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురైంది. బస్సులు ప్లాట్‌ఫామ్‌పైకి రాకముందే రన్నింగ్‌లో ఉన్నప్పుడే సీట్ల కోసం కిటికీలోంచి ఖర్చీఫులు, బ్యాగులు వేయడం వంటివి చేశారు. మరికొందరు డోర్ల దగ్గర నెత్తిలో ముల్లెమూట, చంకలో చిన్నారులతో బస్సు ఎక్కేందుకు అవస్థలు పడ్డారు.

- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సుల్తానాబాద్ రూరల్: సీఎస్‌సీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కొండూరి రవీందర్ రావు

రైతులకు మరిన్ని మెరుగైన సేవలు

నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సుల్తానాబాద్ రూరల్, ఫిబ్రవరి 14: పీఏసీఎస్‌లలో కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుతో రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. కనుకుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో విండో చైర్మన్ కోట వీణ-రాజమల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎస్‌సీ సెంటర్‌ను డీసీసీబీ చైర్మన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం అన్ని గ్రామాల్లో పీఏసీఎస్‌కు సంబంధించి మరిన్ని సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, మేనేజర్ హన్మంతరావు, కేడీసీసీబీ సుల్తానాబాద్ మేనేజర్ శశిధర్‌రావు, ఫీల్డ్ ఆఫీసర్ సాగర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొమ్మిడి వెంకటరాంరెడ్డి, సెక్రెటరీ శంకరయ్య, సభ్యులు శంకరయ్య, రమేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, జగన్, సంఘ సిబ్బంది, రైతులు ఉన్నారు.

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

- ఈ ఆర్థిక సంవత్సరంలో ₹7,980. కోట్లు మంజూరు
- బ్యాంకర్లను అభినందించిన కలెక్టర్ పమేలా సత్పతి

రుణాల పంపిణీలో కరీంనగర్ టాప్

కరీంనగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : రుణాల పంపిణీలో కరీంనగర్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాల రికవరీ, పీఎంజీపీవై రుణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్షా సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాంకర్లను అభినందించి మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9,924 స్వయం సహాయక బృందాలకు ₹640.35 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని ఫిబ్రవరి 2024 వరకు 10,643 స్వయం సహాయక బృందాలకు ₹677.69 కోట్లు లింకేజ్ ద్వారా అందించి 105.83 శాతం ప్రగతి సాధించినట్లు చెప్పారు. లక్ష్య సాధనలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రధాన మంత్రి ఫార్మాలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద 572 యూనిట్లు లక్ష్యం కాగా, 190 యూనిట్లు గ్రౌండింగ్ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు వివిధ కార్యకలాపాల ద్వారా బేకరీ, స్పైసస్, ఫ్లోర్‌మిల్, రోస్టర్ మెషిన్, దాల్ మిల్, బియ్యం ఆధారిత ఉత్పత్తులు, తదితర యూనిట్లను గ్రౌండింగ్ చేసినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు ₹7,980.08 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో వ్యవసాయ రంగానికి ₹3,528.12 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో ₹1,551.52 కోట్లు, గృహ రుణాలు ₹225.18 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు ₹677.69 కోట్లు, ఇతర రంగాలకు ₹1,983.40 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 106.66 శాతం పూర్తయ్యిందన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లాలోని అన్ని సినిమా థియేటర్లలో లఘు చిత్రాలను ప్రదర్శించాలని, సైబర్ నేరాల బాధితుల వివరాలు, ఫొటోలను వెల్లడించకుండా వారు ఎలా నష్టపోయారో తెలిసేలా ప్రచార కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని సూచించారు. అనంతరం 100 మోడల్ సీఎస్‌సీ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం ఆంజనేయులు, ఆర్బీఐ అధికారి సాయి తేజ, నాబార్డ్ ఏజీఎం ప్రకాశ్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామచంద్రుడు, యూబీఐ చీఫ్ మేనేజర్ కలీం, టీజీబీ ఏసీఎం ప్రభుదాస్, కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణ, అన్ని బ్యాంకుల కంట్రోలర్, కరీంనగర్ లోకల్ బ్రాంచ్ మేనేజర్లు, డీఆర్‌డీవో శ్రీధర్, డీఏవో ప్రియదర్శిని, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నవీన్, డీడబ్ల్యూవో సరస్వతి, ఉద్యాన శాఖ డీడీ శ్రీనివాస్, చేనేత శాఖ ఏడీ చరణ్, అడిషనల్ డీఆర్‌డీఏ సునీత, డీపీఎం రవీందర్ పాల్గొన్నారు.

నమ్మించి గొంతు కోసి..

- బైక్ డబ్బులు ఇవ్వలేదని స్నేహితుడి హత్య
- తప్పించుకొని తిరుగుతున్న నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వేములవాడ డీఎస్పీ

నిందితుడిని అరెస్టు చూపి మాట్లాడుతున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి

వేములవాడ, ఫిబ్రవరి 14 : తన బైక్ డబ్బులు ఇవ్వలేదని, అందరి ముందు హేళన చేస్తున్నాడని స్నేహితుడిని మరో స్నేహితుడే నమ్మించి గొంతు కోశాడు. ఆ తర్వాత తప్పించుకొని తిరుగుతూ.. బుధవారం పోలీసులకు చిక్కాడు. ఈ మేరకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నాగేంద్రాచారి వివరాలు వెల్లడించారు. వేములవాడ పట్టణంలోని ఓల్డ్ అర్బన్ కాలనీకి చెందిన బాబు, కురుకుంట్ల శ్రీధర్ స్నేహితులు. అయితే, మూడేళ్ల క్రితం ఆ ఇద్దరి మధ్య వచ్చిన చిన్న గొడవలు వచ్చాయి. ఈ కారణంగా బాబు ఆ వాహనాన్ని శ్రీధర్ పెట్రోల్ పోసి తగలబెట్టాడు. ఈ ఘటనలో శ్రీధర్ తన స్నేహితుడు బాబుకి రూ.లక్ష పరిహారం ఇవ్వడానికి ఒప్పుకొని, ₹50 వేలు మాత్రమే ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వకుండా స్నేహితుల ముందు శ్రీధర్ చులకనగా మాట్లాడుతున్నాడని బాబు మనసులో పెట్టుకున్నాడు. కక్ష పెంచుకొని తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో బాబు ముంబై వెళ్లి తిరిగి పది రోజుల క్రితం వేములవాడకు రాగా, బాబును చూసిన శ్రీధర్ కించపరిచే మాటలతో హేళన చేశాడు. దీంతో బాబు విసిగిపోయి శ్రీధర్‌ను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. సమయం కోసం వేచి చూసి ఆదివారం రాత్రి 11 గంటలకు శ్రీధర్ ఇంటికి వెళ్లాడు. బయటకు రమ్మని చెప్పి శ్రీధర్ బైక్ పైనే వేములవాడ రెండో బైపాస్‌లో ఉన్న ఓ గెస్ట్‌హౌస్ పక్కన ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లాడు. అక్కడ శ్రీధర్‌కు బాగా మద్యం తాగించి, తన వెంట తెచ్చుకున్న కత్తితో గొంతును కోసి హత్య చేశాడు. తర్వాత శ్రీధర్ బండిని తీసుకెళ్లి తప్పించుకు తిరుగుతున్నాడు. గురువారం అందిన సమాచారంతో శివపార్వతులకాలనీ పక్కన డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద బాబును పోలీసులు పట్టుకొని, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ కరుణాకర్, ఎస్ఐ అంజయ్య, ఏఎస్ఐ బేగ్ పాల్గొన్నారు.